నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: పట్టణ పరిధిలోని 11కేవీ జ్యోతినగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా నేడు పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు తెలిపారు. పట్టణంలోని జ్యోతినగర్, చాకలిబస్తీ, టీచర్స్ కాలనీ, బ్యాంకుకాలనీ, సంతోషిమాత ఆలయ పరిసర ప్రాంతాలు, మజీద్ పరిసర ప్రాంతాలు, మార్కెట్ ప్రాంతం, ఇందిరానగర్, బృందావన్ కాలనీలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

పోచారం: విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ యశ్వంత్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నివాళి

మేడ్చల్: మేడ్చల్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత డీవీ కిషన్‌రావు అనారోగ్యంతో మృతి చెందారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆయన కుటుంబాన్ని పరామర్శించి, శుక్రవారం జరిగిన అంత్యక్రియలకు హాజరయ్యారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల కూడా అంత్యక్రియల్లో స్థానిక నేతలతో కలిసి పాల్గొన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో చిన్నారుల ప్రదర్శన

కీసర: రాంపల్లిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. దీపావళి పండుగను మనమంత ఎంతో ఘనంగా నిర్వహించుకుంటామని, ఈ దీపావళి పండుగను పర్యావరణహితంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్కువ శబ్దం లేని టపాకాయలు కాల్చాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం కె.సుశీల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సేవాదృక్పథంతో వైద్యం అందించాలి

మేడిపల్లి: ఆసుపత్రులు సేవాదృక్పథంతో రోగులకు వైద్యం అందించాలని కాంగ్రెస్ నేత ఈశ్వర్‌రెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ సాయిప్రియకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బీవీఆర్ ఫిజియోథెరపీ, రియాబ్ సెంటర్‌ను శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సేవాదృక్పథంతో రోగులకు వైద్యసేవలు అందిచాలన్నారు. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులపై దాడికి పాల్పడిన వ్యక్తుల రిమాండ్

మల్లాపూర్: వాహనదారులపై దాడికి పాల్పడిన వ్యక్తులను నాచారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మణిక్‌చంద్ చౌరస్తాలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, సురేష్‌లు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో మల్లాపూర్ జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన సద్దుల రాఘవ (22) బ్రహ్మపురి కాలనీకి చెందిన చింతల నరేష్(31) నాగేందర్‌బాబు (24) మత్తులో ద్విచక్రవాహనాన్ని ఇష్టానుసారంగా నడుపుతూ హల్‌చల్ చేశారు. వీరిని గిరిబాబు, సురేష్‌లు ప్రశ్నించగా రాళ్లతో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

హోమియోపతి వైద్యం సురక్షితం

రామంతాపూర్: హోమియోపతి వైద్య విధానం సురక్షితమైందని, వివిధ వ్యాధులకు చికిత్సలు నిర్వహించేటప్పుడు శరీరంలోని ఇతర విభాగాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావాలను చూపని ఏకైక వైద్య విధానమని తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ అదనపు డైరెక్టర్ డాక్టర్ లింగరాజు అన్నారు. శుక్రవారం రామంతాపూర్ ప్రధాన రహదారి ఆవరణలో ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాల ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హోమియో ఎక్స్‌పో ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సౌమ్యమైన సంపూర్ణమైన పద్ధతిలో అతి తక్కువ ఖర్చుతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ఆరోగ్యం కాపాడే వైద్య విధానం హోమియోపతి అని కొనియాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, ఎక్స్‌పో కో ఆర్డినేటర్ డాక్టర్ పార్థసారథి, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు చోటేది ?

పోచారం మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డు కరువు

- ప్రస్తుతం ఓఆర్‌ఆర్ సర్వీస్‌రోడ్డు పక్కనే డంపింగ్
- వేరే చోటుకు మార్చాలంటున్న స్థానికులు



ఇష్టానుసారంగా చెత్తను కాలుస్తున్న దృశ్యం

పోచారం: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరిస్తున్న కాలనీల కారణంగా రోజూవారీగా చెత్తసేకరణ, తరలింపు ప్రక్రియ పోచారం మున్సిపాలిటీలో మలుపులు తిరుగుతోంది. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలరు. అలా కాకుండా వద్దన్న చోటే చెత్త,చెదారం వేయడం వల్ల దుర్వాసన వ్యాపించడంతో ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారు.

డంపింగ్‌యార్డు కరువు..

పోచారం గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు అన్నోజిగూడలోని యాదాద్రి పార్కు వద్ద డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత కొద్ది నెలలకే అన్నోజిగూడలో డంపింగ్‌యార్డును ఇతర ప్రాంతానికి తరలించాలని స్థానికులు ఆందోళన చేయడంతో పోచారంలోని సంస్కృతి టౌన్‌షిప్ సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశానికి కొద్దికాలం తరలించారు. అక్కడ కూడా పెద్దఎత్తున అభ్యంతరాలు రావడంతో యంనంపేట్‌లోని గాంధీనగర్ సమీపంలో ఉన్న పార్కు స్థలంలోని చెత్తను డంప్ చేసేవారు.

ప్రైవేటు స్థలంలో పారబోత..

లాక్‌డౌన్ సమయలంలో డంప్ చేస్తున్న స్థలం తమదని కొందరు వ్యక్తులు డాక్యుమెంట్లు తీసుకొచ్చి మున్సిపల్ అధికారులకు చూపించారు. తాత్కాలికంగా చెత్త డంప్ చేస్తున్నామని, ప్రత్యామ్నాయం దొరకగానే ఖాళీ చేస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారు. లే అవుట్‌లో సదరు స్థలాన్ని పార్కు కోసం కేటాయించారని కొందరు వ్యక్తులు ఆధారాలు సమర్పించడంతో డంపింగ్ నిలిపేసి, మొక్కలు నాటి పార్కుగా గుర్తించారు. ప్రస్తుతం యంనంపేట్‌లోని ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో చెత్తను డంప్ చేస్తున్నారు. అక్కడ నుంచి జవహర్‌నగర్‌లోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు.

చెత్తను కాల్చేస్తున్నారు...

సర్వీస్ రోడ్డు పక్కన డంప్ చేస్తున్న చెత్త నిత్యం కాలుతూనే ఉంటుంది. కొన్నిసార్లు నీటితో మంటలను అదుపు చేస్తున్నారు. సర్వీస్ రోడ్డు పక్కన పొగతో పాటు దుర్వాసన వెదజల్లడంతో ఊపిరితీసుకోవడం కష్టంగా ఉంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్తను కాలుస్తున్నందుకే పోచారం మున్సిపాలిటీకి జరిమానా విధించామని, కాలుష్యనియంత్రణ మండలి ఏఈ శరత్ చెప్పారు.

15 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు..

ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో డంప్ చేసి, అక్కడ నుంచి లారీలతో జవహర్‌నగర్‌లోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. లారీలు రాని సమయంలో చెత్త పేరుకుపోతోంది. మున్సిపాలిటీలో రోజుకు గరిష్టంగా 15 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. కానీ కొత్తగా ఏర్పడిన కాలనీల నుంచి చెత్తను సేకరించలేకపోతున్నారు. దీంతో అనేక ప్రాంతాల్లో ప్రజలే కాకుండా దుకాణదారులు చెత్తను కాల్చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

కొత్త స్థలం కోసం అన్వేషిస్తున్నాం..

చెత్త డంపింగ్ కోసం కొత్త ప్రదేశాన్ని అన్వేషిస్తున్నాం. డంపింగ్‌కు అనుకూలంగా ఉండేలా ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఘట్‌కేసర్ మండల రెవెన్యూ అధికారులను కోరాం.
– శరత్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

పోచారం: అన్నోజిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీపీఆర్‌పై 108 అంబులెన్స్ సిబ్బంది అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినప్పుడు ప్రాథమిక చికిత్సగా సీపీఆర్ నిర్వహణ గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాలు, పాముకాటు బాధితులు, గర్భిణులు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈఎంటీ (టెక్నీషియన్) రమేష్, పైలట్ భద్రునాయక్, స్కూల్ హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

మేడ్చల్: పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 108 గ్రీన్‌హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. 108 ప్రతినిధులు విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి, సీపీఆర్ ఎలా చేయాలనే అంశాలపై వివరించారు. సమావేశంలో భూమా నాగేందర్, తిరుపతి, అంజి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

‘ఐజీఎస్’ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీ (ఐజీఎస్) స్టూడెంట్ చాప్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐజీఎస్ హైదరాబాద్ చాప్టర్ సెక్రటరీ హరిప్రసాద్ పాల్గొని విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో జియోటెక్నికల్ చాప్టర్ ప్రాధాన్యత గురించి వివరించారు. ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి మాట్లాడుతూ.. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు బీటెక్ తర్వాత సివిల్ ఇంజినీరింగ్ రంగంలో ఉన్న అవకాశాలు, ప్రయోజనాలు‘ అనే అంశంపై మాట్లాడారు. నిర్మాణరంగంలో అత్యధిక ఆదాయం పొందుతున్న ఇంజినీర్ల ఉదాహరణలు తెలియజేసి విద్యార్థులను ప్రేరేపించారు. కళాశాల కార్యదర్శి టీవీరెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, కో-ఆర్డినేటర్లు రాజశేఖర్, వెంకటేష్‌రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, హెచ్‌ఓడీ వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు



పోచారం: యంనంపేట్ రైల్వేట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కాపాడారు. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం దమ్మాయిగూడలోని బాలాజీనగర్‌కు చెందిన మమత 100కు ఫోన్ చేసి తన భర్త యంనంపేట్ సమీపంలో రైల్వేట్రాక్‌పై ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్ చేశాడని చెప్పింది. ఈ మేరకు యంనంపేట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ విజయభాస్కర్‌రెడ్డి, పెట్రోలింగ్ మొబైల్ సిబ్బంది కలిసి రైల్వేట్రాక్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వెంకటయ్య (41) రైల్వేట్రాక్ సమీపంలో ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేస్తుండగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని రక్షించారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న తాను ఆర్థికఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడాలనుకున్నట్లు చెప్పాడు. వెంకటయ్యకు కౌన్సెలింగ్ ఇచ్చి, సురక్షితంగా కుటుంబసభ్యులకు అప్పగించారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కీసర: రాంపల్లిలో హనుమాన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. నాగారం మున్సిపల్ పరిధిలోని ఆలయం ఎదురుగా ఉన్న హనుమాన్ విగ్రహాన్ని గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. శుక్రవారం విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, వివిధ పార్టీల నేతలు, హిందూ సంఘాల నేతలు పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా పోలీసులు దుండగులను గుర్తించి చట్టపరంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ చైర్మన్ రామారం నర్సింహతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రమాదకర ప్రయాణం !



మేడ్చల్‌రూరల్: వాహనదారులు నిబంధనలు పాటించాలంటూ ప్రభుత్వం, పోలీస్, ఆర్టీఓ అధికారులు చెబుతున్నా.. కొందరు వాహనదారులు నిబంధనలు బేఖాతరు చేస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వాహనదారులు ధనార్జనే ధ్యేయంగా పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులను నిత్యం ప్రాణసంకటంలో పడవేస్తున్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌లో సాక్షి కెమెరాకు చిక్కింది. పొట్టకూటి కోసం వచ్చిన కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఇలాంటి వాహనదారులపై అధికారులు ఉక్కుపాదం మోపాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్: పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించాలని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంకుషాపూర్, ఎదులాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డీసీసీ వెంకట్‌రెడ్డి, డీఎం సుగణబాయితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2389, కామన్ రకానికి రూ.2369ల మద్దతు ధర ప్రకటించిందన్నారు. తేమశాతం 17కు మించకుండా ధాన్యం తీసుకురావాలని, కేంద్రంలో రైతులకు ఎలాంటి అసౌకర్య కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ఎఫ్‌ఎస్‌సీఎస్ వైస్‌చైర్మన్ అనంతరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, మహేందర్‌నాయక్, నాయకుడు కుమార్‌ముదిరాజ్, మండల వ్యవసాయాధికారి లావణ్య, సహాయకుడు జగదీశ్, రైతులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి

శామీర్‌పేట్: బాణసంచా దుకాణదారులు ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పకుండా పాటించాలని అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ అధికారి ధనుంజయరెడ్డి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట ఫైర్ స్టేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బాణసంచా (పటాకులు) విక్రయించే దుకాణాల్లో బాలకార్మికులను పనిలో పెట్టకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణసంచా దుకాణాల వద్ద వాహనాలను నిలపకూడదన్నారు. కనీసం 10 మీటర్ల దూరంలో వాహనాలను పార్క్ చేయాలని సూచించారు. దుకాణాల వద్ద కనీసం 2 డ్రమ్ముల నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఇప్పటివరకు బాణసంచా విక్రయించేందుకు 98 మంది వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 92 మందికి అనుమతులు ఇచ్చామని తెలిపారు. 6 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించామన్నారు. ఎమర్జెన్సీ ఫైర్ సేవలకు 101 డయల్ చేయాలని, ఉమ్మడి శామీర్‌పేట్ మండల ప్రజలు సేవలకు శామీర్‌పేట ఫైర్ స్టేషన్ కార్యాలయం 8712699398.

కార్మికుల హక్కుల కోసం పోరాటం



కమలానగర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కాప్రా: కార్మిక చట్టాల పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ చట్టాలు కార్మికుల హక్కుల హరించే విధంగా ఉన్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఈనెల 25, 26న నిర్వహించే సీఐటీయూ జిల్లా 4వ మహాసభల సందర్భంగా శుక్రవారం ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ హాల్‌లో రెండ్రోజుల పాటు కొనసాగుతాయని ప్రకటించారు. సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, ఉన్ని కృష్ణ, గణేష్, బీవీ సత్యనారాయణ, ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి

మేడ్చల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం నేడు చేపట్టబోయే రాష్ట్ర వ్యాప్త బంద్‌లో కాంగ్రెస్ నేతలు, అన్ని పార్టీల బీసీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌ముదిరాజ్ కోరారు.

ఘట్‌కేసర్: బీసీల హక్కులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు బీసీ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేద్దామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సంజీవముదిరాజ్ పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రవ్యాప్త బంద్‌కు మద్దతు తెలపాలన్నారు.

ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాగారం , దమ్మాయిగూడ మున్సిపాలిటీల అధ్యక్షుడు కృష్ణస్వామి, ప్రధానకార్యదర్శి బానయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక

మల్లాపూర్: నాచారం డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థిని కైరా ఈనెల 28న అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో జరగబోయే జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు రాష్ట్రం నుంచి ఎంపికైంది. 69వ ఎస్‌సీఎఫ్ రాష్ట్ర చాంపియన్ అండర్– 17లో 42 కేజీల విభాగంలో కైరా పాల్గొని బంగారు పతకం సాధించింది. శుక్రవారం పాఠశాల చైర్మన్ నవనీతారావు, ప్రిన్సిపాల్ స్వర్ణ సత్కరించి అభినందించారు.

అద్దె భవనాల్లో సౌకర్యాలు కరువు

- 793 అంగన్‌వాడీ కేంద్రాలకు 443 అద్దె భవనాల్లోనే
- రూ.1.40 కోట్ల బకాయిలు, 7 నెలలుగా అద్దె చెల్లించలేని పరిస్థితి
- విద్యుత్, తాగునీరు, శానిటేషన్‌తో ఇబ్బందులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు 7 నెలల అద్దె డబ్బులు చెల్లించకపోవటంతో యాజమానుల నుంచి వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తోందని అంగన్‌వాడీలు ఆందోళన చెందుతున్నారు.

నెలకు దాదాపు రూ.20 లక్షలు..

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు నెలకు దాదాపు రూ.20 లక్షల చొప్పున రూ.1.40 కోట్ల అద్దె బకాయిలు పేరుకపోవడంతో ఒత్తిళ్లను తట్టుకోలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దె కేంద్రాల పరిస్థితి ఇలా ఉంటే.. సొంత భవనాలున్న కేంద్రాలకు కూడా సరియైన వసతులు లేక మాతాశిశువులు అసౌకర్యాలతో అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాల (హెల్పర్లు)కు కూడా నెలనెలా జీతాలు అందించలేకపోతున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పసి పిల్లలు, గర్భిణులు, బాలింతలను పలు సమస్యలు ఎదుర్కోక తప్పడం లేదు.

793 కేంద్రాల్లో 1.07 లక్షల మంది

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 6 నెలల నుంచి ఆరేళ్ల పిల్లలు 68,913 మంది, గర్భిణులు, బాలింతలు 9,972 మంది ఉండగా.. మొత్తంగా 78,885 మంది ఉన్నారు. ఇందులో కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 313 కేంద్రాలు ఉండగా.. 33,226 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు, మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 15,481 మంది, అల్వాల్ పరిధిలో 269 అంగన్‌వాడీ కేంద్రాల్లో 30,178 మంది పిల్లలు, గర్భిణులు ,బాలింతలు ఉన్నారు.

సొంత భవనాలు లేనివే అధికం..

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 212 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 443 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

- కుత్బుల్లాపూర్ ప్రాజెక్ట్ పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అత్యధికంగా 277 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అల్వాల్‌లో 271 కేంద్రాలలో 143 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.
- మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాలకు 23 మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

తాగునీటికి ఇబ్బందే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 117 కేంద్రాలలో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో అత్యధికంగా 77 కేంద్రాల్లో తాగునీరు లేదు. అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 40 కేంద్రాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.

టాయిలెట్లు అంతంతే..

జిల్లాలో మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలకు 118 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్ట్ పరిధిలో 78, అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 51, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల సమస్య తీవ్రంగా ఉంది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె చాలా తక్కువ కావడంతో ఓనర్లు టాయ్‌లెట్ కట్టించి ఇచ్చే పరిస్థితి లేదు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు స్నాక్స్ !

- నవంబర్ నుంచి పదోతరగతి విద్యార్థులకు ప్రారంభం
- జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలల్లో 87,468 మంది విద్యార్థులు

సాక్షి,మేడ్చల్ జిల్లా : ప్రభుత్వ నిర్ణయంతో సర్కారు బడుల రూపురేఖలు మరింత మారనున్నాయి. ఇప్పటికే మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్న ప్రభుత్వం పదోతరగతి విద్యార్థులకు వచ్చేనెల నుంచే స్నాక్స్ ఇవ్వబోతోంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు అల్పాహారం ఇచ్చేందుకు చర్యలు చేపట్టనుంది. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం సహజం. సాయంత్రం ఇళ్లకు వెళ్లడానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతో సాయంత్రం పూట వీరికి స్నాక్స్ ఇస్తున్నారు. వీటిని సంక్రాంతి తర్వాత మొదలుపెట్టి సుమారు 40 రోజులపాటు కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది నవంబరు 1 నుంచి అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం ఆర్థికంగా ప్రభుత్వానికి భారమైనా విద్యార్థులకు ఉపయుక్తం కానుంది. ఈ ఏడాది ఇప్పటికే ప్రత్యేక తరగతులు మొదలయ్యాయి. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 1.07 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 108 ఉన్నత పాఠశాలలు ఉండగా.. 7,965 మంది పదోతరగతి విద్యార్థులు చదువుకుంటున్నారు.

పకడ్బందీగా అమలుకు..

అల్పాహారం అమలుకు ఇంకా సమయం ఉండటంతో ప్రభుత్వం ఇప్పటి నుంచే పక్కాగా చర్యలు తీసుకోవాల్సిన అవసరంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం మధ్యాహ్న భోజనాన్ని నిర్వహిస్తున్న ఏజెన్సీలకు నెలనెలా బిల్లులు రావడం లేదు. గౌరవ వేతనం సక్రమంగా చెల్లించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని తెలుస్తోంది.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ఉండటంతో పాటు తల్లిదండ్రులు వివిధ పరిశ్రమల్లో అసంఘటిత రంగం, కుటిర పరిశ్రమలు, నిర్మాణ రంగంలో కాయకష్టం చేస్తున్నారు. వారికి ఉదయాన్నే ఇళ్ల వద్ద అల్పాహారం సిద్ధం చేయడం కష్టతరమవుతోంది. దీంతో చాలామంది పిల్లలు ఏం తినకుండానే పాఠశాలలకు వస్తుంటారు. ఇక్కడ మధ్యాహ్న భోజనం ఒంటి గంటకు పెడతారు. ఖాళీ కడుపులతో విద్యార్థులు బోధనపై దృష్టిసారించలేకపోతున్నారు. వీటన్నింటి ప్రభావం వార్షిక పరీక్షలపై పడుతోంది. దీంతో ప్రభుత్వం ఉదయం పూట అల్పాహారం ఆదరించాలని నిర్ణయించింది. వచ్చే ఏడాది విద్యార్థులందరికీ ఖాయంగా అందజేస్తామని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

బోడుప్పల్: నేరాలను అదుపుచేయడంలో సీసీకెమెరాలు ఎంతో దోహదపడతాయని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. బోడుప్పల్ ఈస్ట్ బాలాజీహిల్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆమె మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రతకోసం ప్రతి ఒక్కరూ సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి మాట్లాడుతూ.. దొంగతనాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కొన్ని కాలనీల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల పూర్తిగా దొంగతనాలను అరికట్టగలిగామన్నారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సుమన్‌నాయక్, ఎస్సై తిరుపతిరెడ్డి, నేతలు మోహన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ కాలనీవాసులు పాల్గొన్నారు.